

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం జగనన్న ధ్యేయమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెర్నపాడు గ్రామంలో పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. -8లో



ఆశలు జల సమాధి.!

హంద్రీ నీవా కాలువలో చేపలు పట్టడానికి వెళ్లిన ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకుంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8/16.9

జిల్లాలో ఆదివారం 16.9 - 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

జన సునామీ

రాప్తాడులో జన సునామీ ఎగసిపడింది. సంక్షేమ ప్రదాతను చూసి ఉప్పొంగి పోయింది. అడుగడుగునా హారతులు పట్టింది. అభిమాన నాయకుడితో జతకలిసింది. జయహో జగన్ అంటూ మార్మోగించింది. మా నమ్మకం నువ్వేనంటూ హోరెత్తించింది. ప్రతిపక్షాలకు వణుకు పుట్టించేలా రణ నినాదం చేసింది. వై నాట్ 175 అంటూ నలుదిక్కులా నినదించింది. పెత్తందారులతో పోరుకు 'సిద్ధం' అని ప్రకటించింది. ప్రతిపక్షాల నక్కజిత్తులను చిత్తు చేస్తామని స్పష్టం చేసింది. వైఎస్సార్ సీపీ శ్రేణులను సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.

- దద్దరిల్లిన రాప్తాడు
- సీమవాసుల సమరోత్సాహం
- మార్మోగిన జగన్నినాదం
- అడుగడుగునా నీరాజనం
- అంచనాలకు మించి తరలివచ్చిన జనం
- సీఎంతో జతకలిసిన లక్షలాది గొంతుకలు
- ఎన్నికలకు 'సిద్ధ'మని ఆకాశాన్నంటేలా గళం
- 'వై నాట్ 175' అని నినదించిన వైనం
- సిద్ధం' సభ విజయవంతం





రాప్తాడు వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అనంతపురం: సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం మోగిస్తూ రాప్తాడులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అతి పెద్ద ప్రజా సభకు రాప్తాడు వేదికైంది. సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులే కాకుండా జనం భారీగా తరలివచ్చారు. సునామీని తలపించారు. అంతులేని అభిమానాన్ని చాటారు. తండోపతండాలుగా వచ్చిన జనసందోహంతో సభా స్థలం కిక్కిరిసిపోయింది. ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు ఇంత పెద్ద స్థాయిలో జనం పోటెత్తడం బహుశా ఇదే ప్రథమం!

మండుటెండను సైతం లెక్కచేయకుండా..

రాయలసీమ పరిధిలోని 52 అసెంబ్లీ నియోజకవర్గాలు, 7 పార్లమెంట్ నియోజక వర్గాల నుంచి వందలాది బస్సులు, వేలాది వాహనాలలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అభిమాన నేత రాక కోసం ఎదురు చూశారు. 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా స్థలం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకే జనంతో నిండిపోయింది. దీంతో చాలామంది జాతీయ రహదారిపై నిల్చునే సీఎం ప్రసంగాన్ని విన్నారు. వచ్చిన వారికి అసౌకర్యం కలగకుండా గ్యాలరీల వద్ద చల్లని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచారు.

పంచ్ డైలాగ్‌లతో దద్దరిల్లిన సభ

సీఎం వైఎస్ జగన్ తన ప్రసంగంతో శ్రేణులను హోరెత్తించారు. దాదాపు 75 నిమిషాల పాటు ప్రసంగించిన ఆయన.. గత 57 నెలల్లో పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలను వివరించారు. మధ్యమధ్యలో పదునైన పంచ్ డైలాగ్‌లతో అందరినీ ఆకట్టుకున్నారు. 'విశ్వసనీయతకు, వంచనకు మధ్య జరుగుతున్న యుద్ధం.. 'సీమ'లో సముద్రం లేకపోవచ్చు.. కానీ నేడు రాప్తాడులో జన సముద్రం చూడొచ్చు.. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లో తిరుగుతూ ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయట ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లో ఉండాలి'' అంటూ ఆయన పేల్చిన పంచ్ డైలాగ్‌లకు లక్షలాది గొంతుకలు అనుకూలంగా ప్రతిధ్వనించాయి. ''చొక్కా మడతేసి.. బాబు కుర్చీని సైతం మడతేసి చీపురుతో ఊడ్చి వాళ్ల పార్టీని మడతేయడానికి సిద్ధంగా ఉన్నారా?' అని సీఎం జగన్ అన్నప్పుడు 'మేమూ సిద్ధమే' అంటూ గొంతెత్తారు.

నడిచొచ్చి..ఉత్సాహం నింపి

మధ్యాహ్నం 3.40 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం జగన్ వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా స్థలం మొత్తం కవర్ చేస్తూ ఫ్యాన్ ఆకారంలో ఏర్పాటు చేసిన వాక్ వే వద్దకు చేరుకున్నారు. 10 నిమిషాల పాటు ప్రజలందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగి ఉత్సాహం నింపారు. అభిమాన నేతను దగ్గర నుంచి చూసిన పార్టీ శ్రేణులు మురిసిపోయాయి.

ముఖ్యమంత్రి ప్రసంగించినంత సేపూ ఈలలు, చప్పట్లతో మద్దతు పలికారు. 14 ఏళ్ల పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయకపోగా అవినీతి, అభూత కల్పనలతో పాలన సాగించారని విమర్శించినపుడు 'నిజం' అంటూ ప్రజలు మద్దతు తెలిపారు. పెత్తందార్లు, పేదవారికి మధ్య జరిగే యుద్ధానికి 'సిద్ధమా' అని సీఎం జగన్ అన్నప్పుడు 'సిద్ధం' అంటూ నినదించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

'సిద్ధం'ను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువకులు తీన్‌మార్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. సీఎం జగన్ పాలనలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని ప్రముఖ కళాకారులు కళ్లకు కట్టారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు నారాయణస్వామి, అంజాద్ బాష, ఉషశ్రీ చరణ్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూం పరిశీలన

కమలాపురం: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని నిలువ చేసే స్ట్రాంగ్ రూంను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పరిశీలించారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ఎన్నికల సామగ్రి ఎక్కడ నిల్వ ఉంచాలి.. సిబ్బందికి సామగ్రి పంపిణీ, పార్కింగ్ స్థలాలు ఎక్కడ ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందని ఆయన పరిశీలించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సీఐ రామకృష్ణారెడ్డి, ఎన్నికల డీటీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అబాకస్‌లో ప్రతిభ



ట్రోఫీలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

రాయచోటి టౌన్: జాతీయ స్థాయిలో నిర్వహించే అబాకస్, మెంటల్, అర్థమెటిక్ పోటీల్లో రాయచోటి ప్రాంతానికి చెందిన 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచారని, ట్రోఫీలు సాధించారని రాయచోటి అబాకస్ బ్రాంచ్ నిర్వాహకురాలు శాంతి తెలిపారు. ఆదివారం రాయచోటి ఎన్‌జీవో హోంలో వారికి సామాజిక కార్యకర్త జిన్నా షరీఫ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీలు జనవరి 28వ తేదీ చెన్నైలో నిర్వహించారన్నారు. కార్యక్రమంలో అబాకస్ బ్రాంచ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని వైఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో సీనియర్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఖోఖో సంఘం కార్యదర్శి జె.నరేంద్ర, ప్రధానోపాధ్యాయులు పి.కాశీప్రసాద్ రెడ్డి, పుల్లారెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో సంఘం కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ ప్రతిభ చూపిన 15మంది మహిళలు, 15 మంది పురుషులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి, లక్ష్మీదేవి, మల్లికార్జున, కృష్ణయ్య, పవన్ కుమార్ పాల్గొన్నారు.

సహకారం.. ప్రగతిపథం

- 106 ఏళ్లుగా రైతుల సేవలో డీసీసీ బ్యాంకు
- ప్రభుత్వ ప్రత్యేక చొరవతో అభివృద్ధివైపు పయనం



కడపలోని డీసీసీ బ్యాంకు

కడప అగ్రికల్చర్: కడప డీసీసీ బ్యాంకు ఏర్పాటై ఈ ఏడాదితో 106 ఏళ్లు పూర్తయింది. రైతుల ప్రయోజనాల కోసం సహకార రంగంలో అప్పట్లో ఏర్పడిన తొలి బ్యాంకు ఇది. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రైతులు, వ్యాపారులకు, డ్వాకా సంఘాలకు సాధారణ రుణాలలు, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను కూడా అందిస్తోంది. అలాంటి డీసీసీ బ్యాంకును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక చొరవ తీసుకుని మరింతగా లాభాల బాట పట్టించింది.అలాగే జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) కూడా లాభాలబాట పట్టించారు. 2021 సంవత్సరంలో 13 వేల టర్నోవర్ ఉన్న బ్యాంకు లావాదేవీలు ప్రస్తుతం రూ. 3 వేల కోట్లకు చేరుకున్నాయి. ఈ విషయమై ఇటీవల కడప డీసీసీ బ్యాంకులో సంబరాలు నిర్వహించారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 24 బ్రాంచీలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 24 బ్రాంచీలు ఉన్నాయి. మరో నాలుగు కొత్త బ్రాంచీల ఏర్పాటుకు ఇటీవల రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి కూడా ఇచ్చింది. వీటి పరిధిలో 72 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిల్లో మొన్నటి వరకు పలు సహకార పరపతి సంఘాలు నష్టాల్లో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీ బ్యాంకుతోపాటు సహకార సంఘాల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో సహకారం సంఘాలు కేవలం రైతులకు మాత్రమే రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడం వరకు మాత్రమే పరిమితమయ్యాయి. కానీ నేడు ఇవి కూడా మినీ బ్యాంకులుగా, కామన్ సర్వీస్ సెంటర్లుగా మారి ఖాతాదారులకు, రైతులకు సేవలందిస్తున్నాయి. చాలా సహకారం సంఘాల్లో రైతు రుణాలు, కమర్షియల్ రుణాలు కూడా అందిస్తున్నారు. దీంతో పీఏసీఎస్‌లలో సేవలు పెరిగి జిల్లాలోని 25 పీఏసీఎస్‌లు లాభాలబాట పట్టాయి.

- సహకార సంఘాలను లాభా బాట పట్టించడమే లక్ష్యంగా జిల్లా సహకారం కేంద్రబ్యాంకులో ఫాక్స్ డెవలప్‌మెంట్ సెల్ ఏర్పాటైంది. దీనికి ఆప్కాబ్‌కు చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. పీఏసీఎస్‌లలో ఏ వ్యాపారాలు ఏర్పాటు చేస్తే లాభాలు వస్తాయనే ప్రతిపాదనలను ఫాక్స్ డెవలప్‌మెంట్ సెల్ తయారు చేసి ఆప్కాబ్‌కు, నాబార్డుకు పంపుతుంది. ఇందుకు సంబంధించి సహకార సంఘాలకు ఆస్తులను ప్రభుత్వం సమకూరుస్తోంది.
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 72 సహకార సంఘాలున్నాయి. వాటి పరిధిలోని లింగాల, చెన్నమరాజుపల్లె, సోమిరెడ్డిపల్లె, వెల్లటూరు. చిట్వేల్, పోరుమామిళ్ల, కొత్తకోట, బి. కోడూరు పీఏసీఎస్‌ల పరిధిలో రూ. 3.51 కోట్లతో మల్టీసర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. మరో రూ. 13.5 కోట్లతో పలు రైతుభరోసా కేంద్రాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్‌ను నిర్మిస్తుంది. ఇందుకు సంబంధించి 33 గోడౌన్స్ మంజూరుకాగా ఇందులో 4 గోడౌన్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.మరో 20 తుదిదశకు చేరుకున్నాయి.9 గోడౌన్స్ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

వ్యాపార రంగంలో...

వ్యాపార రంగంలో కూడా అభివృద్ధి సాధించే దిశంగా పీఏసీఎస్‌లు అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా 8 వాటిల్లో 8 జనరిక్ మెడికల్ స్టోర్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపగా అందులో 4 పీఏసీఎస్ పరిధిలో వీటి ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. అలాగే 8 పీఏసీఎస్‌ల పరిధిలో హిందుస్తాన్ పెట్రోలియం లిమిటెడ్ బంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా అందులో మూడింటిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనుమతి లభించాయి. త్వరలో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే మైదుకూరు పీఏసీఎస్‌లో రైతులకు ఎరువులను కూడా అందిస్తున్నారు.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని 10 పీఏసీఎస్‌లలో ఆప్కాబ్ సహకారంతో బ్యాంకు రుణాలను ఇచ్చేందుకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేశారు. ఇందులో ప్రస్తుతం 6 పీఏసీఎస్ పరిధిలో బ్యాంకు రుణాలు, మరో నాలుగింటిలో బంగారు రుణాలు ఇవ్వడం ప్రారంభించనున్నారు.

బ్యాంకు సేవలతోపాటు ఉద్యోగ సేవలు కూడా...

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు సంబంధించి రాష్ట్రంలోనే వైఎస్సార్ జిల్లాలో మొదటి సారిగా హెచ్‌ఆర్ పాలసీని అమలు చేశారు. డీసీసీ బ్యాంకుతోపాటు పలు పీఏసీఎస్‌లలో 112 మంది కొత్త వ్యక్తులకు ఉద్యోగాలను ఇచ్చి ఉపాధి కల్పించారు. వీటితో పాటు ఇటీవల బ్యాంకులో కరెంట్ సేవింగ్స్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు, రుణాల మంజూరుకు సంబంధించి అత్యుత్తమ ఫలితాలను సాధించిన జీఎం, ఏజీఎంలతోపాటు బ్యాంకు సిబ్బందికి బహుమతులను ప్రదానం చేశారు.

పీఏసీఎస్ ఉన్న ప్రాంతం	ఉద్దేశం	నిధులు (రూ.లక్షల్లో)
లింగాల	ఫార్మర్స్ కమ్యూనిటీ హాల్	20
చెన్నంరాజుపల్లె	కమర్షియల్ కాంప్లెక్స్	54.00
సోమిరెడ్డిపల్లె	ఫార్మర్స్ కమ్యూనిటీహాల్	24
వెల్లటూరు	కమర్షియల్ కాంప్లెక్స్	54.50
చిట్వేల్	మ్యారేజ్ ఫంక్షన్‌హాల్	77.0
పోరుమామిళ్ల	కమర్షియల్ కాంప్లెక్స్	74.00
కొత్తకోట	ఫార్మర్స్ కమ్యూనిటీ హాల్	24.00
బి. కోడూరు	ఫార్మస్ కమ్యూనిటీ హాల్	24.00

రైతుల అభ్యున్నతే లక్ష్యం



రైతుల అభ్యున్నతికి అవసరమైన అన్ని రకాల రుణాలను ఇస్తున్నాం. కొన్ని పీఏసీఎస్‌ల పరిధిలో షాపులను ఏర్పాటు చేసి రైతులకు ఎరువులను, పురుగు మందులను కూడా అందిస్తున్నాం. వీటని ఉపయోగించుకుని రైతులు అభివృద్ధి చెందాలి.

-మల్లెల ఝాన్సీరాణి, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్

బ్యాంకు అభివృద్ధికి కృషి



కడపలోని డీసీసీ బ్యాంకు అన్ని కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సేవలందిస్తోంది. అలాగే జిల్లా లోని పరపతి సంఘాలు కూడా లాభాల బాటలో నడుస్తున్నాయి. అందరి సహాయ సహకారాలతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తాం.

- కె.రాజేంద్రకుమార్, సీఈఓ, డీసీసీ బ్యాంకు

రాణించిన ఆంధ్రా బ్యాట్స్‌మన్

- 6 బంతుల్లో 6 సిక్సర్లతో రికార్డు
- 64 బంతుల్లో సెంచరీ చేసిన వంశీకృష్ణ



తలపడుతున్న ఆంధ్ర-రైల్వేస్ జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు అండర్-23 ట్రోఫీలో భాగంగా ఆదివారం ఆంధ్ర, రైల్వేస్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 64 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సర్‌లతో 110 పరుగులు చేశాడు. రైల్వేస్ జట్టు బౌలర్ దమన్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో వంశీకృష్ణ 6 బంతుల్లో 6 సిక్సర్‌లతో చెలరేగి కడప మైదానంలో సరికొత్త రికార్డు సృష్టించాడు. ఈయనకు జతగా ఇ. ధరణినాయుడు 108 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 81 పరుగులు చేశాడు. టి. వంశీకృష్ణ 55 పరుగులు, వెంకటరాహుల్ 61 పరుగులు చేశారు. రైల్వేస్ జట్టు బౌలర్లు ఎండి జైశ్వాల్ 3, దమన్‌దీప్‌సింగ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



110 పరుగులు చేసిన ఎం. వంశీకృష్ణ



81 పరుగులు చేసిన ధరణినాయుడు

చక్రస్నానం.. సర్వపాపహరణం



పుష్కరిణిలో స్నానాలు చేస్తున్న భక్తులు



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు ఆదివారం స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం, సుదర్శన చక్ర తాళ్వార్‌కు తీర్థస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకీలో స్వామి, అమ్మవార్లతోపాటు శ్రీ చక్రాన్ని ఊరేగింపుగా పుష్కరిణి మండపానికి చేర్చారు. అక్కడ రెండున్నర గంటలపాటు వేద మంత్ర యుక్తంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతంతోపాటు ఇతర ద్రవ్యాలతో కూడా అభిషేకించారు.వట్టివేర్లతో ప్రత్యేకంగా దండలను స్వామి, అమ్మవార్లకు అలంకరించడం విశేషం. అనంతరం ఉత్సవమూర్తులను చక్ర తాళ్వార్‌తో పాటు పుష్కరిణిలోకి తీసుకెళ్లారు. గోవిందనామ స్మరణలు, భక్తుల కోలాహలం మధ్య మూలమూర్తులతోసహా అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేశారు. భక్తులు తాము కూడా పుష్కరిణిలో మునకలు వేసి పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి వేద మంత్రోచ్చాటనల మధ్య ఆలయ ప్రాంగణంలో గరుడ పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. దీంతో కడప రాయుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

వైభవంగా ధ్వజావరోహణం

నేడు పుష్పయాగం

బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం స్నపన తిరుమంజనం చేయనున్నారు. సాయంత్రం 6 నుంచి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 6 నుంచి 9.00 గంటల సమయంలో ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో పుష్పయాగం నిర్వహించనున్నారు.

కువైట్ కో-కన్వీనర్‌గా మర్రి కళ్యాణ్



మర్రి కళ్యాణ్

రాజంపేట: కువైట్-కో-కన్వీనర్‌గా రాజంపేట పట్టణానికి చెందిన మర్రి కళ్యాణ్ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కువైట్ ఎన్‌ఆర్‌ఐ విభాగం కువైట్ కమిటీ నియమించారు. ఈ కమిటీలో మర్రి కళ్యాణ్‌కు కో-కన్వీనరుగా ఎన్నికచేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి, వైఎస్సార్ గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్, గల్ఫ్ కన్వీనరు ఇలియాస్, కువైట్ కన్వీనరు బాలిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషిచేస్తానన్నారు.

క్లుప్తంగా

200 కిలోల ప్రభుత్వ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 200 కిలోల ప్రభుత్వ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎర్రగుంట్ల అర్బన్ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆటోను సీజ్ చేసి దస్తగిరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హిందీ టెట్, డీఎస్సీకి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న టెట్, డీఎస్సీకి సిద్ధమవుతున్న హిందీ అభ్యర్థులకు స్థానిక నబీకోట, చౌడమ్మగుడి వద్ద ఉన్న జి.ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షఫీవున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95538 92223 లేదా 91822 097089 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


విజేతలతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి 2వ ఓపెన్ చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనీస్ దర్బారీ ప్రారంభించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలను బహుకరించారు. టోర్నమెంట్ చాంపియన్‌గా ప్రభుదేవా, రెండోస్థానంలో సూరజ్‌కుమార్, మూడోస్థానంలో కడప నగరానికి చెందిన చిన్మయ, తర్వాత స్థానాల్లో ఉమాదేవి, జగదీష్, అనురాగ్‌ప్రీతం, రెడ్డిపవన్, వినోద్, ప్రణవ్‌రెడ్డి, అభిరామన్ నిలిచారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, తబస్సుమ్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే జగనన్న ధ్యేయం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


పెర్నపాడు గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేముల : రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే సీఎం జగనన్న ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెర్నపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ నాగేళ్ల సత్యప్రభావతమ్మ, ఎంపీపీ చల్లా గంగాదేవి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ గోడౌన్, మినరల్ వాటర్ ప్లాంటు, నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, అండర్ డ్రైనేజీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మండలంలో ఒక్కో గోడౌన్‌ను నిర్మించామన్నారు. పంట ఉత్పత్తులకు ధరలు లేనప్పుడు నిల్వ చేసుకుని ధరలు వచ్చిన తర్వాత అమ్ముకునే విధంగా గోడౌన్లను తీర్చిదిద్దామన్నారు. అరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులకు ధరలు లేనప్పుడు నష్టపోకుండా రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో వీటిని నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు సాగు చేసిన పంటలు ఏ సీజన్‌లో దెబ్బతింటే ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులను ఆదుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో పంటలు దెబ్బతిని నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందో రాదో తెలియని స్థితిలో రైతులు ఉండేవారని.. ఇచ్చినా అది ఎప్పుడు ఇస్తారో కూడా తెలిసేది కాదన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతుల కంట కన్నీరు చూడకూడదనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే జగనన్న నమ్మారన్నారు. అంతేకాక సచివాలయ వ్యవస్థతో పరిపాలన ప్రజల వద్దకే తీసుకొచ్చి వారి చెంతకే సంక్షేమ పథకాలు అందేలా చేశారని ప్రశంసించారు. ప్రతి గ్రామంలోనూ 1వ తేదీ వచ్చిందంటే వేకువ జామున అవ్వాతాతల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందించే కార్యక్రమాన్ని వలంటీర్ల ద్వారా అమలు చేసి దేశంలోనే సీఎం జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. గ్రామీణ వాసులకు సురక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్మించి మంచినీటిని అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు అమలు చేశారన్నారు. ఇన్ని పథకాలను అమలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకాంతమ్మ, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, రామచంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, యువనేతలు నాగేళ్ల పవన్ విశ్వేశ్వరరెడ్డి, నాగేళ్ల హర్షవర్ధన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



మాకు ఇప్పటి వరకు నివాసం ఉండేందుకు ఇల్లు లేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలో నా పేరు మీద ఇంటి స్థలం కేటాయించి ఇల్లు కూడా కట్టించి ఇచ్చారు. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. మా వలంటీర్ ద్వారా స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. సొంతింటి కల నెరవేరడంతో చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.

- లింగంగుంట బుజ్జమ్మ, బ్రాహ్మణపల్లె, గోపవరం మండలం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాడు – నేడు పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. అంతేకాక విద్యార్థులకు అమ్మ ఒడి లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి ఉన్నత చదువులకు ఎంతో కృషి చేస్తున్నారు.

- ఎస్.శ్యాంకుమార్‌రెడ్డి (ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు), నల్లపురెడ్డిపల్లె

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది సామాన్య కుటుంబం. రేషన్‌కార్డు లేక చాలా ఇబ్బందుల పడ్డాం. అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. వలంటీరు సహాయంతో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నా. దీంతో కొత్తగా రేషన్‌కార్డు వచ్చింది. దీంతో ప్రతి నెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నా. జగనన్నకు రుణపడి ఉంటాం.

-గులాబ్‌జాన్, బాపనకాలువ, మదనపల్లె

ఆశలు జల సమాధి!

- హంద్రీనీవా కాలువలో పడి ఇంటర్ విద్యార్థి మృతి
- కడుపు కోత మిగిల్చిన చేపల సరదా


మృతి చెందిన విద్యార్థి సుధీర్

కురబలకోట : హంద్రీ నీవా కాలువలో సరదాగా చేపలు పట్టడానికి స్నేహితునితో కలసి వెళ్లిన ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పూజారివారిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన కె. సుధీర్ (16) మదనపల్లెలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను మండలంలో పూజారివారిపల్లెలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ కళాశాలకు వెళ్లేవాడు. ఆదివారం సెలవు కావడంతో పూజారివారిపల్లెలో మరో స్నేహితుడితో కలిసి ఊరికి సమీపంలో వెళుతున్న హంద్రీ నీవా కాలువలో సరదాగా చేపలు పట్టడానికి వెళ్లాడు. కాలువలోకి దిగే ప్రయత్నంలోనే ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. నీళ్ల లోతుగా ఉండడంతో ఇతను ఉన్నట్టుండి మునిగిపోయాడు. ఇతనికి ఈత రాదు. వెంటనే పక్కనే ఉన్న స్నేహితుడు రక్షించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దిక్కుతోచని స్థితిలో కేకలు వేయడంతో స్థానికులు వెంటనే వచ్చి వెతికారు. అప్పటికే ఇతను మునిపోయాడు. తల్లిదండ్రులకు ఇతను ఒక్కడే సంతానం. ఆశలన్నీ నీపైనే పెట్టుకుని బతుకుతున్నాం.. నీ భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నాము కదరా.. ఎంత పని చేశావురా.. భగవంతుడా ఇక మేము ఎవరి కోసం బతకాలయ్యా.. అంటూ బిడ్డ మృతదేహంపై పడి తల్లి దండ్రులు గుండెలు పగిలేలా విలపించడం అందరి గుండెలను పిండేసింది.

బీసీల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్


వేదికపై సంఘీబావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ ఆత్మ గౌరవ సభ నిర్వహించారు. ఈ సభకు విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను జిల్లా నుంచి యాదవ సామాజిక వర్గం నుంచి చట్ట సభలకు ఎంపికైన తొలి వ్యక్తిని అని తెలిపారు. బీసీల అభివృద్ధికి తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్య వస్తే తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ బీసీలు అంటే బాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్రిలియంట్, బిగ్గెస్ట్ క్యాస్ట్ అన్నారు. బీసీలకు రాజ్యాధికారం సాధించడం కోసం పోరాటం చేయాలన్నారు. ఏ పార్టీ బీసీలకు టికెట్ ఇచ్చినా అందరూ బీసీలు గెలుపొందేందుకు కృషి చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్ రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే బీసీల తలరాత మారుతుందన్నారు. ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారం కల్పించేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రొద్దుటూరు అసెంబ్లీ సీటును బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే తమకు భవిష్యత్తు ఉంటుందన్నారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలపై ఆధారపడకుండా బీసీలందరూ ఒక తాటిపైకి వచ్చి సమర్థవంతుడైన నాయకుడిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి గెలిపించుకుందామని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళా దేవి మాట్లాడుతూ బీసీలంతా సంఘటితమైతే రాజ్యాధికారాన్ని సులభంగా సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, మల్లెల భాస్కర్, మాదాసు మురళి, జింకా మార్కండేయ, పలు ప్రాంతాలకు చెందిన బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం నూకినేనిపల్లి పంచాయతీ కుంపిణీపురంలో వెలసిన వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజైన ఆదివారం రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుతీర్చారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో ఉన్న జాగీరుదారుల వంశస్తులు రథాన్ని లాగడంతో ఊరేగింపు ప్రారంభమైంది. రథాన్ని లాగేందుకు మహిళలు పెద్దఎత్తున పోటీపడ్డారు.

ప్రతి వైద్యుడు రోగులపట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ జి. సుధాకర్


వైద్య విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ సుధాకర్

కడప అర్బన్ : ప్రతి వైద్యుడు తమ వైద్య వృత్తి ప్రారంభించినప్పటి నుంచి రోగులపట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ జి. సుధాకర్ అన్నారు. 2018 బ్యాచ్ వైద్య విద్యార్థులకు 'ఎథికల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్'ను ఆదివారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలోని లెక్చర్‌హాల్'లో నిర్వహించారు. త్వరలో వైద్య విద్యను పూర్తి చేసుకుని వైద్యవృత్తిలో అడుగిడుతున్న వైద్య విద్యార్థులకు రోగులతో ప్రవర్తించాల్సిన పద్ధతులు, బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. రోగుల పట్ల బాధ్యతగా ఉండాలని వైద్యాధికారుల సమక్షంలో వైద్య విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఒత్తిడి లేని విద్యను అందించాలి


మాట్లాడుతున్న వింప్ డైరెక్టర్ విజయ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఒత్తిడిలేని విద్యను అందించి వారు మానసికంగా ప్రశాంతంగా ఉండేలా చూడాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, వింప్ డైరెక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన (ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్) ఎస్టీఎఫ్ ప్రథమ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు వాడకూడదని అవగాహన కల్పించాలన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మురళీ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ట్రెజరర్ శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న క్రిష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన టెంపో


బోల్తా పడిన టెంపో

మదనపల్లె సిటీ : వేగాన్ని నియంత్రించలేక రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి టెంపో బోల్తా పడిన సంఘటన మదనపల్లెలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెంచుపాడుకు చెందిన ప్రసాద్ అనే యువకుడు టెంపోలో మదనపల్లెకు వస్తుండగా చిత్తూరు బస్టాండు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని టెంపో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రసాద్ గాయపడ్డాడు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.

బైక్‌నే ప్రచార రథంగా మార్చి..

జగనన్న కోసం ఓ ఉద్యోగి ప్రచారం


ప్రచార రథంపై అమరనాథ్ రెడ్డి

రాప్తాడు : తన జీవితం జగనన్నకే అంకితం అంటున్నాడు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేటకు చెందిన రామిరెడ్డి అమరనాథ్ రెడ్డి. ఈయనకు ముఖ్యమంత్రి అంటే పంచ ప్రాణాలు. విశాఖ శివారు దువ్వాడ ఫార్మాసిటీలోని లీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో 11 ఏళ్లుగా క్వాలిటీ విభాగంలో పనిచేస్తూ గాజువాకలో ఉంటున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించినందున రూ.40 వేల వేతనం వచ్చే ఉద్యోగాన్ని సైతం వదిలేసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటూ ప్రతి గ్రామం, వీధిలో ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం తన ద్విచక్ర వాహనాన్నే ప్రచార రథంలా మార్చేశారు. వాహనానికి ఇరువైపులా 'బలవంతుడికి...బలహీనుడికి జరిగే యుద్ధం' అనే స్టిక్కర్ అతికించుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు హెల్మెట్‌కు కూడా ప్రచార నిమిత్తం స్టిక్కరింగ్ చేయించుకున్నారు. అమరనాథ్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లోనూ జగన్ కోసం ప్రచారం చేశారు. ప్రస్తుతం కూడా తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు వీలుగా తన భార్య మనోజ్ఞ, ఏడాది పాప నివేదితా రెడ్డిని గుంటూరులోని అత్తారింట్లో వదిలి పెట్టినట్లు అమరనాథ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు తాను ప్రచారంలో పాల్గొంటానన్నారు. జీవితాంతం జగనన్నతోనే తన ప్రయాణం అంటూ ఉద్వేగభరితంగా చెప్పారు.

ఆలోచనాత్మక కథారచయిత షరీఫ్


డాక్టర్ నాగరాజును సన్మానిస్తున్న సీపీ బ్రౌన్ కేంద్రం డైరెక్టర్ తదితరులు

కడప కల్చరల్ : ఆలోచనాత్మక కథారచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగుశాఖ అధ్యాపకుడు డాక్టర్ పి. నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 129వ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'డాక్టర్ వేంపల్లె షరీఫ్ జీవితం–సాహిత్యం' అన్న అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జనజీవన స్థితిగతులను, ముస్లిం జీవితాలను, ముస్లింవాదాన్ని తన కథల్లో ఆలోచనాత్మకంగా చిత్రిస్తూనే మానవతా వాదానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆయన రచన జుమ్మాకు కేంద్ర సాహిత్య యువ అకాడమీ పురస్కారం లభించిందన్నారు. అనంతరం ఆయన రచనలు టోపీజబ్బార్, పర్దా , చోంగా రోటీ, ఒంటి చెయ్యి తదితర కథల గురించి అభిప్రాయాలను వివరించారు. డాక్టర్ వేంపల్లె షరీఫ్ తన స్పందన తెలియజేస్తూ నెలనెలా సీమ సాహిత్యంలో ప్రసంగం ఏర్పాటు చేయడం, విశ్వవిద్యాలయంలో తన రచనలపై పరిశోధనలు జరుగుతుండటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వక్త నాగరాజును, షరీఫ్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణమూర్తి, గ్రంథపాలకులు హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రమణ, మౌనిక, రచయితలు కొత్తపల్లి రామాంజనేయులు, సత్తార్‌ఫైజీ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

రాజంపేట : రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్‌లో బీట్ కానిస్టేబుల్ మహేష్ దురుసు ప్రవర్తనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ(న్యూఢిల్లీ)కి ఫిర్యాదు చేసినట్లు డి.జస్వంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉంటున్న తన స్నేహితుడు రాజా, తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులమన్నారు. బుధవారం రాత్రి 11.30 గంటలకు రాజా ఇంటి వద్ద పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకుంటున్నామన్నారు. అటుగా వెళుతున్న కానిస్టేబుల్ మహేష్ తమను ఎందుకున్నారని ప్రశ్నించారని తెలిపారు. ఇది తమ ఇల్లేనని, చెబుతుండగా, ఆదేమీ పట్టించుకోకుండా కానిస్టేబుల్ వీడియో చిత్రీకరణ చేశారన్నారు. మొబైల్‌కు చెయ్యి అడ్డుపెట్టినందుకు, ఆగ్రహంతో బూటుకాలితో తన్నాడన్నారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. కానిస్టేబుల్ మాటలు విని, సీఐ మద్దయ్య ఆచారి వాస్తవాలను విచారించకుండా తనపై, తన మిత్రునిపై 353, 506 సెక్షన్ల కింద కేసునమోదు చేశారన్నారు. తప్పుడుకేసు బనాయించిన పోలీసులపై చర్యల తీసుకుని తమకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మార్చి 11, 12న జరగనున్న గంగమ్మ జాతరకు ఇప్పటి నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.